నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 31 జూలై 2024 | KAMAREDDY


రుణమాఫీ చెక్కు అందిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మోహన్‌రెడ్డి, తాహెర్

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

- అన్నదాతలకు తోడ్పాటునందించాలి
- అధికారులకు నిజామాబాద్ కలెక్టర్ ఆదేశం
- కలెక్టరేట్‌లో రైతులకు రుణమాఫీ చెక్కుల అందజేత

ఖలీల్‌వాడి, జూలై 30: పంట రుణమాఫీ ద్వారా అర్హులైన ప్రతి రైతు ప్రయోజనం పొందేలా బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు అన్నదాతలకు తోడ్పాటునందించాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. ఏ ఒక్క రైతు అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. రెండో విడుత రుణమాఫీ చేస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ లబ్ధిదారులకు రుణమాఫీ చెక్కులను అందజేశారు. అంతకు ముందు హైదరాబాద్‌లో రుణమాఫీ నిధుల విడుదల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని అధికారులు, రైతులతో కలిసి తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం చేపడుతున్న రుణమాఫీ ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడైనా క్షేత్ర స్థాయిలో ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇప్పటికే తొలి విడుత మాఫీకి సంబంధించి 517 ఫిర్యాదులను పరిష్కరించామని చెప్పారు. సహాయక కేంద్రాన్ని సంప్రదించేందుకు వీలుపడని రైతులు నేరుగా 72888 94557, 72888 94554 నెంబర్లకు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ సూచించారు. మలివిడుత రుణమాఫీ నిధులను రెండు రోజుల్లోపు రైతుల ఖాతాల్లో అందుబాటులో ఉండేలా చూడాలని, వారు తమ అవసరాల కోసం ఆ నిధులను వినియోగించుకునేలా చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఏడీఏ వాజిద్‌హుస్సేన్, సహకార శాఖ అధికారి శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చౌహాన్, పాపయ్య పాల్గొన్నారు.

కామారెడ్డిలో 74,756 రైతులకు లబ్ధి

రైతులకు రుణమాఫీ చెక్కును అందజేస్తున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి, జూలై 30: పంట రుణమాఫీ పథకం ద్వారా జిల్లాలో 74,756 రైతు కుటుంబాలకు సంబంధించిన రూ.442 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. రెండో విడుత రుణమాఫీ నిధుల విడుదల సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రైతులకు చెక్కులు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తొలి విడుతలో 49,940 మంది రైతు కుటుంబాలకు 231 కోట్ల మేర లబ్ధి జరిగిందన్నారు. మలి విడుతలో 24,816 మంది రైతు కుటుంబాలకు రూ.211 కోట్లను ప్రభుత్వం వారి ఖాతాలలో జమ చేసిందన్నారు. రుణమాఫీలో ఇబ్బందుల్లేకుండా చూస్తున్నామని, తొలివిడుత మాఫీకి సంబంధించి 1,209 ఫిర్యాదులను రాగా పరిష్కరించామని తెలిపారు. రైతులకు సమస్యలు ఉంటే 72888 94616,72888 94600కు కాల్ చేసి పరిష్కరించుకోవచ్చని వివరించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ, డీఏవో భాగ్యలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికాంత్ పాల్గొన్నారు.

మలి విడుతలోనూ మాఫీ కాలే..

- మిగతా వారికి మొండిచేయి
- చాలా మంది రైతుల్లో నైరాశ్యం
- రేవంత్ సర్కారుపై ఆగ్రహం
- కుటుంబం ప్రాతిపదికన సగం మందికి కోత

మొన్న లక్ష లోపు పంట రుణాలన్నీ మాఫీ చేస్తున్నామన్నారు.. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే వేలాది మంది రైతులకు మాఫీ వర్తించలేదు. తాజాగా మలి విడుతలో రూ.లక్షన్నర లోపు రుణాలు మాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. రెండో విడుత జాబితాలో పేరు ఉందేమోనని ఆశగా ఎదురు చూసిన అన్నదాతలకు భంగపాటే మిగిలింది. క్రాప్ లోన్ రూ.లక్ష కన్నా తక్కువ ఉన్నా తమకు మాఫీ కాలేదని రైతాంగం ఆందోళన చెందుతున్నది. గ్రామాల వారీగా కుటుంబాలను ప్రాతిపదికన తీసుకుని తయారు చేసిన జాబితాలో చాలా మంది రైతులకు రుణాలు మాఫీ కాలేదు. కేసీఆర్ హయాంలోనే బాగుండే అని రైతులు రచ్చబండ కాడ ముచ్చట్లు పెడుతున్నారు. గతంలో ప్రతి రైతుకు ప్రయోజనం జరిగిందని, ఇప్పుడైతే కొద్ది మందికే రావడం ఏమిటని నోరెళ్ల పెడుతున్నారు. అధికారంలోకి రాక మునుపు రైతులను రెచ్చగొట్టి రూ.2లక్షల లోపు రుణాలను తీసుకోవాలంటూ ఎగదోసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు గద్దెనెక్కిన తర్వాత రైతులను వంచించడం తగదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో రుణమాఫీ కాని వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో, లబ్ధి పొందిన రైతులు స్వల్పంగానే ఉండడంతో.. ప్రభుత్వం చేసిన మోసాలపై గ్రామాల్లో చర్చ కొనసాగుతున్నది.
-నిజామాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

రుణమాఫీ వచ్చిందో లేదోనని తెలుసుకునేందుకు వచ్చిన రైతులతో కిటకిటలాడుతున్న కోటగిరిలోని భారతీయ స్టేట్ బ్యాంక్

మళ్లీ కొందరికే వర్తింపు..

కనిపించని జోష్..

రుణమాఫీతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రయోజనాన్ని దక్కించుకోవాలని చూసింది. రైతులకు ఏదో చేశామని చెప్పుకోవడానికి యత్నించింది. కానీ క్షేత్ర స్థాయిలో అమలైన రూ.లక్షలోపు రుణమాఫీతో రేవంత్ ప్రభుత్వ తీరు బట్టబయలు కావడంతో కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో రైతుల నుంచి స్పందన రాకపోవడంతో కాంగ్రెస్ నేతలు ఆగమాగమయ్యారు. రెండో విడుతలోనూ ఇదే దుస్థితి అధికార పార్టీకి ఎదురైంది. రైతుల్లో జోష్ కనిపించకపోవడంతో పాటు కర్షకుల నుంచి ఎదురవుతున్న తిట్ల దండకాన్ని తట్టుకోలేక చాలా మంది ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుంటున్నారు. మాకెందుకు రుణమాఫీ రాలేదని రైతులు కాంగ్రెస్ నాయకుల ఇండ్లకు పరుగులు తీస్తున్న ఘటనలు సైతం చాలా చోట్ల వెలుగు చూస్తున్నాయి. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నేతలు ఏదో ఒకటి చెప్పి తప్పించుకుంటున్నారు. మొదటి విడుతలో ఒక రోజు ముందే వ్యవసాయ శాఖ వివరాలను వెల్లడించింది. కానీ రెండో విడుతలో మాత్రం వివరాల వెల్లడిలో గోప్యతను పాటించింది. రూ.లక్ష లోపు మాఫీ సమయంలో భారీగా ప్రచారం చేసుకుని లబ్ధి పొందాలని భావించిన ప్రభుత్వానికి ఊహించని షాక్ తగిలింది. గ్రామాల వారీగా రుణమాఫీ కాని వారే ఎక్కువగా ఉండడంతో రైతులంతా దుమ్మెత్తి పోశారు. ఈ నేపథ్యంలోనే రెండో విడుతలో రైతుల వివరాలు వెల్లడించకుండా కేవలం బ్యాంక్ అకౌంట్ల సమాచారాన్ని మాత్రమే వెల్లడించినట్లు తెలుస్తున్నది.

నిజామాబాద్ జిల్లాలో అధికారులు చెబుతున్న మాఫీ లెక్క..

విడుత	రైతు ఖాతాల సంఖ్య	చెల్లించిన నిధులు (రూ.కోట్లలో)
తొలి	44,469	225.62
రెండో	22,868	210.54
మొత్తం	67,337	436.16

కామారెడ్డి జిల్లాలో మాఫీ లెక్క..

విడుత	రైతు ఖాతాల సంఖ్య	చెల్లించిన నిధులు (రూ.కోట్లలో)
తొలి	47,002	220.09
రెండో	24,816	211.72
మొత్తం	71,818	431.81

ఆఫీసుల చుట్టూ తిరుగుడే ఉంది..

నాగిరెడ్డిపేట, జూలై 30: నాకు ఆత్మకూర్, రామక్కపల్లి శివారులో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నా పేరుమీద రూ.80 వేలు, మా భార్య పేరుమీద రూ.55 వేల రుణం ఉంది. మా భార్య పేరును మండలంలోని మరొకరి రేషన్ కార్డులో ఎంట్రీ చేయడంతో.. రుణమాఫీ కావడం లేదు. నా పేరుమీద ఉన్న రుణమైన అవుతుందనుకుంటే ఇప్పటికీ కాలేదు. రుణమాఫీ ఏందో గానీ ఆఫీసుల చుట్టూ తిరుగుడుకే సరిపోతుంది. ఏదో సాకు చెబుతూ.. డబ్బులు పడకుండా ఆపుతున్నారే తప్ప.. నేరుగా జమ చేసి రైతులకు లబ్ధి చేయడం లేదు.
- గొరిగారి వెంకట్‌రెడ్డి, రైతు, ఆత్మాకూర్

తప్పెవళ్లదో కానీ.. మాఫీ అయితే కాలె

పెద్దకొడప్‌గల్, జూలై 30: నేను 2021ల కెనరా బ్యాంక్‌లో రూ. 36,500 క్రాప్‌లోన్ తీసుకున్నా. రుణమాఫీ చేస్తారంటే సంతోషమైంది. మొదటి లిస్టుల పేరు రాలేదు. రెండోసారీ అయిన అత్తదనుకుంటే రాలే. ఏవో నదీముద్దీన్ సార్‌ను అడిగితే, మీ కుటుంబంల ఇతరులవి రెండు పేర్లు ఉన్నాయని చెప్పిండు. తప్పెవరిదో తెలియదు కానీ నాకు మాత్రం లోన్ మాఫీ కాలే.
-మెట్టు విఠవ్వ, మహిళా రైతు, పెద్దకొడప్‌గల్

రుణమాఫీ లిస్టులో పేరు లేదు..

బ్యాంక్‌లో లక్షా 40వేల లోన్ తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం రెండో విడుత ప్రకటించిన లిస్టులో నా పేరు లేదు. మా కుటుంబంలో నా ఒక్కడి పేరు పైనే క్రాప్ లోన్ ఉన్నది. అయినా నాకెందుకు రాలేదో అర్థం కావడం లేదు. ఏమైందో అధికారులే చెప్పాలె. అందరికీ మాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలె.
- బెల్కంటి సాయిలు రైతు, పోచారం

ఎవరిని అడగాలో అర్థమైతలేదు..

నాకు లక్షా 40వేల క్రాప్‌లోన్ ఉన్నది. 2018 లో తీసుకొని ఏటా రెన్యువల్ చేస్తూనే ఉన్న. ప్రభుత్వమేమో రెండో విడుతలో లక్షా 50 వేల రుణమాఫీ అని చెప్పింది. రెండో విడుత రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. ఎవరినీ అడగాలో అర్థమైతలేదు. అధికారులను అడిగితే ఆగస్టు 15 వరకు రావచ్చని సమాధానం ఇస్తున్నరు. ఏం చెయ్యాల్నో తోస్తలేదు.
- సుధాకర్, రైతు, అంబం, రుద్రూర్ మండలం


రెంజల్‌లోని రైతు వేదికలో.. రుణమాఫీ జాబితాలో తమ పేరుందో లేదో తెలుసుకుంటున్న రైతులు

ఆశ వర్కర్లు, జీపీ కార్మికుల అరెస్టు
హైదరాబాద్ వెళ్లకుండా అడ్డంకులు
పోలీసుల తీరుపై మండిపడిన ఆశలు, కార్మికులు

నిర్బంధాలు, అక్రమ అరెస్టులు

ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బందిని రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించిన పోలీసులు

కోటగిరి, జూలై 30: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళ్లకుండా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఇండ్లలో నిర్బంధించడంతో పాటు ఊరు దాటి వెళ్లొద్దంటూ కొందరికి నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ తరలి వెళ్లకుంగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని కోటగిరి, చందూరు, మోస్రా, బాన్సువాడ, రాజంపేట్ తదితర మండలాల్లోని కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. కోటగిరి మండల పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షురాలు రాజేశ్వరికి ఇంటికి సోమవారం రాత్రి చేరుకున్న పోలీసులు ఆమెకు నోటీసులు జారీ చేశారు. ధర్నాకు వెళ్లొద్దని, గ్రామం దాటొద్దని ఆదేశించినట్లు ఆమె వాపోయారు. డిమాండ్ల సాధన కోసం తాము శాంతియుతంగా ఆందోళన చేద్దామనుకుంటే అడ్డుకోవడం సరికాదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, డిమాండ్ల సాధన కోసం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని తలపెట్టిన ఆశ కార్యకర్తలను బాన్సువాడ పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆశ కార్యకర్తలు ఠాణా ఎదుట నిరసన తెలిపారు.

బాన్సువాడ పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

కామారెడ్డి జిల్లా బిడ్డలకు గోల్డ్ మెడల్స్

గోల్డ్ మెడల్స్ విజేతలు

బాన్సువాడ, జూలై 30: కోల్‌కత్తాలో జరిగిన ఆసియా చెస్ చాంపియన్‌షిప్, ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ బాక్సింగ్-2024 సబ్ జూనియర్ విభాగంలో కామారెడ్డి బిడ్డలు సత్తా చాటారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మనవడు రుషాంక్‌రెడ్డి రెండు గోల్డ్ మెడల్స్‌ను సాధించాడు. ఈ నెల 29న జరిగిన ఫైనల్‌లో అతడు కేరళ క్రీడాకారుడిపై విజయం సాధించి బంగారు పతకాన్ని సాధించాడు. సీనియర్ మహిళా విభాగంలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన పిట్లం మండలం తక్కడ్‌పల్లికి చెందిన క్రీడాకారిణి ప్రతిభ ఐదు గోల్డ్ మెడల్స్‌ను సాధించారు. సీనియర్ పురుషుల విభాగంలో తక్కడ్‌పల్లికి చెందిన విజయ్ రాఘవేంద్ర రెండు సిల్వర్ మెడల్స్‌ను సొంతం చేసుకున్నాడు.

శ్రీరాంసాగర్‌కు జల కళ

మోర్తాడ్, జూలై30: వరద వస్తుండడంతో ఎస్సారెస్పీ జల కళను సంతరించుకుంటున్నది. 17,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిచేరుతున్నది. మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 1076.2 అడుగుల (35.537 టీఎంసీల)కు చేరింది. సరస్వతీ కాలువకు 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నిజాంసాగర్‌లోకి 640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, జూలై 30: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 640క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నదని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00అడుగుల (17.802టీఎంసీల)కు గాను 1389.98అడుగుల (3.803టీఎం సీల) నీరు నిల్వ ఉన్నదని తెలిపారు.

కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పది గ్రామాల రైతులు

నీటిని తరలిస్తే ఉద్యమమే

- పది గ్రామాల రైతుల హెచ్చరిక
- కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా

కామారెడ్డి, జూలై 30: 'ఏండ్ల సంది గ చెర్వునే నమ్ముకున్నం. ఆ నీళ్లతోనే పంటలు పండించుకుంటున్నం. గిప్పుడు యాడికెళ్లి మోపయింద్రో ఏమో. మా నోట్ల మన్నుకొట్టి పెద్ద చెర్వు నీళ్లను కామారెడ్డికి తీసుకుపోతామంటుండ్రు' అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లను తరలించే కుట్రను మానుకోవాలని, లేకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువు నుంచి 30 శాతం నీటిని కామారెడ్డికి తరలించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పది గ్రామాల రైతులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. నీటి తరలింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు. ఇటీవల కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇందుప్రియ అధికారులతో వచ్చి అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువును పరిశీలించి, 30 శాతం నీటిని కామారెడ్డి పట్టణానికి తీసుకెళ్తామని ప్రకటించారని, దీంతో 10 గ్రామాల రైతులం తీవ్రంగా నష్టపోతామన్నారు. నీటిని తరలించుకుపోతే పది గ్రామాలు పడావుగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద చెరువు నుంచి వచ్చే నీటితో అడ్లూర్ ఎల్లారెడ్డి, అడ్లూర్, రంగంపేట్, పోసానిపేట్, రామారెడ్డి, కన్నాపూర్, గొల్లపల్లి, గర్గుల్, ఇస్రోజివాడి, టేక్రియాల్ గ్రామాలకు చెందిన 2,100 ఎకరాల్లో రెండు పంటలు పండుతాయన్నారు. కామారెడ్డికి నీటిని తరలించుకుపోతే రెండు వేల ఎకరాలకు సాగునీరు దొరకదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పునరాలోచించి నీటి తరలింపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా తర్వాత రైతులు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుజాత వద్దకు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. పెద్ద చెరువు నీటిని కామారెడ్డికి తరలించాలనే కుట్ర జరుగుతున్నదని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. నీళ్లను తరలించుకెళ్లి తమ నోట్లో మట్టి కొట్టొద్దని అడ్లూర్ ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ సదాశివారెడ్డి, రామారెడ్డి మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, సదాశివనగర్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జానకీ జనార్దన్ విజ్ఞప్తి చేశారు.

నీటిని తరలిస్తే ఊరుకోం..

అడ్లూర్‌ఎల్లారెడ్డి పెద్ద చెరువు నుంచి నీటిని కామారెడ్డికి తరలించాలని చూస్తే ఊరుకునేది లేదు. మరో ఉద్యమం తప్పదు. వేలాది మంది రైతులు ఈ చెరువు మీదనే ఆధారపడి బతుకుతున్నారు. వాళ్ల నోట్లో మట్టి కొట్టి నీళ్లు ఎత్తుకుపోతామంటే ఊరుకోం. నీటిని తరలించాలన్న ఆలోచన మానుకోవాలి.
- ఎ.బాల్‌రాజు, రైతు, అడ్లూర్ ఎల్లారెడ్డి

ఉపసంహరించుకోవాలి..

అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు నుంచి 30 శాతం నీటిని కామారెడ్డికి తరలిస్తే ఆయకట్టు రైతుల పరిస్థితి ఏమిటో ఆలోచించరా? రెండు వేల ఎకరాల్లోని పంటలు ఎండిపోతాయన్న సంగతి తెల్వదా? నీటిని తరలించాలన్న ఆలోచనను విరమించుకోవాలె. రైతులకు మంచి చేయాల్సింది పోయి ఇబ్బందులు పెడతామంటే ఊరుకునేది లేదు
- బి.వెంకటి, అడ్లూర్ ఎల్లారెడ్డి

పది ఊర్లకు నష్టం

అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు మీద పది ఊర్లు ఆధారపడ్డాయి. ఈ చెరువుతోతాగునీటికి, సాగునీటికి ఇన్నాళ్లు ఢోకా లేకుండె. కొత్తగా ఇప్పుడు వచ్చి పది ఊళ్లకు నష్టం చేస్తామంటే ఎట్ల. నీళ్లను తీసుకుపోతామంటే రైతులు అసలే ఊరుకోరు. పొలాలను ఎండబెడతామంటే చూస్తూ కూర్చోలేం. అధికారులు ఆలోచించాలే. లేకపోతే ఉద్యమాలు లేవదీసుడు తప్ప మరోకటి ఉండది.
- సి.ఆకుల విఠల్, అడ్లూర్ ఎల్లారెడ్డి

రైతులతో ఆడుకోవద్దు..

ఎన్నో ఏండ్ల సంది పెద్ద చెరువును నమ్ముకుని సాగు చేసుకుంటున్నం. కొత్తగా ఇప్పుడొచ్చి నీళ్లు ఎత్తుకుపోతామనుడేంది.? ఎంతో మంది రైతులు ఆధారపడే అడ్లూర్ పెద్ద చెరువు నుంచి నీటిని తరలించే కుట్రను మానుకోవాలి. లేదంటే రోడ్డెక్కుడు తప్ప మరో గత్యంతరం లేదు. సాగు మీద ఆధారపడి బతుకుతున్న రైతులతోని ఆడుకోవద్దు.
- డి.చిన్న మల్లయ్య, రంగంపేట్